# ముఖ్యమంత్రి కార్యాలయము

## తెలంగాణ ప్రభుత్వం

పత్రికా ప్రకటన-4 జనవరి 28, 2015

ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామి మేరకు రాష్ట్రంలో నిలువ నీడ లేని నిరుపేదలకు రెండు బెడ్ రూములతో కూడిన నాలుగు గదుల ఇల్లు నిర్మించి ఇస్తామని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు పునరుద్ఘాటించారు. ఈ కొత్త గృహ నిర్మాణ పథకం ఎలా ఉండాలి? లబ్దిదారుల ఎంపిక ఎలా జరగాలి? గతంలో జరిగిన అవకతవకల నేపథ్యంలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి? నిర్మాణ బాధ్యతలను ఎవరికి అప్పగించాలి? తదితర విషయాలపై బుధవారం సచివాలయంలో ముఖ్యమంత్రి ఆధ్వర్యంలో విస్తృత చర్చ జరిగింది. ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి, మంత్రులు టి. హరీష్‌రావు, కె.టి.రామారావు, ఇంద్రకరణ్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు, సి.లక్ష్మారెడ్డి, జోగురామన్న, ప్రభుత్వ సలహాదారు బివి.పాపారావు, పార్లమెంటరీ కార్యదర్శి జలగం వెంకట్రావ్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రాజీవ్‌శర్మ, సీనియర్ అధికారులు మహేష్‌దత్ ఎక్కా, దానకిషోర్, బుర్రా వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

గృహనిర్మాణ పథకం ఎలా ఉండాలనే విషయంపై మంత్రులు, అధికారుల నుండి ముఖ్యమంత్రి అభిప్రాయాలు సేకరించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ గత ప్రభుత్వాలు పేదలకు ఇండ్లు కట్టించే నెపంతో ఓట్ల వేట చేశాయని, ఫలితంగా గృహ నిర్మాణ పథకం అవినీతికి మారుపేరుగా, అస్తవ్యస్తంగా మారిందని అన్నారు. లక్షల ఇండ్లు మంజూరైనా, వేల కోట్లు ఖర్చయినా ఇంకా నిరుపేదలకు రాష్ట్రంలో నివాసాలే లేకపోవడం గత ప్రభుత్వాలు అనుసరించిన విధానపర లోపాల పాపమని ముఖ్యమంత్రి అన్నారు. గతంలో జరిగిన అవకతవకలపై సిఐడి విచారణ జరిపితే తప్పు జరగని గ్రామమే లేదని తేలుతున్నదని అన్నారు. శాఖాపరమైన విచారణ జరిపితేనే 490 మంది గృహ నిర్మాణ శాఖాధికారులు సస్పెండ్ అయ్యారని, చాలామంది జైలు పాలు కూడా అయ్యారని, అవినీతికి ఇంతకు మించిన సాక్ష్యం

కూడా అవసరం లేదని ముఖ్యమంత్రి అన్నారు. ఈ చేదు అనుభవాలను దృష్టిలో పెట్టుకుని తెలంగాణ రాష్ట్రంలో తప్పులు జరుగకుండా, పేదలకు ఇండ్లు దక్కేలా పక్కా ప్రణాళికతో పథకాన్ని అమలు చేయాలని చెప్పారు. సమగ్ర కుటుంబ సర్వేతో పాటు ఇతరత్రా ప్రభుత్వం వద్ద ఉన్న ఆధారాల ప్రకారం నిరుపేదలను ఎంపిక చేసి వారికి ఇండ్లు కట్టించాలని ముఖ్యమంత్రి అన్నారు. రాష్ట్రంలోని ఇండ్లు లేని వారందరి వివరాలు తయారు చేసుకుని దశల వారిగా ఇండ్ల నిర్మాణం చేపట్టాలని చెప్పారు. హైదరాబాద్, వరంగల్, మహబూబ్‌నగర్ పట్టణాలలో ప్రయోగాత్మకంగా పట్టణ గృహ నిర్మాణ కార్యక్రమం తీసుకున్నామని, వచ్చే ఆర్థిక సంవత్సరం నుండి రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో ఇండ్ల నిర్మాణం చేపట్టాలని ముఖ్యమంత్రి నిర్ణయించారు. అత్యంత నిరుపేదలకు మొదటి ప్రాధాన్యత ఇస్తూ, పూర్తి అవినీతి రహితంగా పథకం ఉండాలని ఆకాంక్షించారు. ఇందుకు అవసరమైన విధి విధానాలు తయారు చేయాలని ముఖ్యమంత్రి అధికారులను కోరారు. మంత్రులు, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు కూడా ఈ విషయంలో తమ అభిప్రాయాలు చెప్పాలని అన్నారు. కేబినెట్‌లో కూడా ఈ విషయాన్ని చర్చిస్తామని ప్రకటించారు. రాజీవ్ స్వగృహ, రాజీవ్ గృహకల్ప లాంటి కార్యక్రమాల ద్వారా కూడా కొన్ని ఇండ్ల నిర్మాణం జరిగిందని, ఆ పథకాల విషయంలో కూడా నిర్ణయం తీసుకోవాల్సి ఉందని చెప్పారు. వాటిని ఎలా ఉపయోగించుకోవాలనే విషయంలో కూడా అధికారులు తగు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కోరారు.

---------------------------------------------------------

సిపిఆర్ఓ టు సిఎం